# పచ్చనిగడ్డిలో పల్లేరుకాయ



"ఇదేనమ్మా మహారాణీపేట ఎవరింటి కెళ్ళాలి?" అన్నాడు రిక్షావాడు బంగారంలాంటి ఊహా ప్రపంచంనుండి బయట పడేసినందుకు రిక్షావాడిమీద కోపం హేమకు ముక్కుమీదకి ఎగబ్రాకబోతుంటే మళ్ళీ ఆనందలక్ష్మి గుర్తుకు వచ్చి మనసులో ఆనంద వీచికలు రేగి సూది ముక్కుమీద కోపం నిలవలేక జారిపోయింది

"అద్దాల మేడ తెలుసా, ఆ ప్రక్కయిల్లే" అని అంటూ తను కూడా అద్దాల మేడ కోసం రిక్షాలోంచి మెడ ముందుకు సాచి చూసింది అల్లంత దూరంలో ఒక మేడ కనిపించింది దానికి అద్దాల కిటికీలు కనిపించేసరికి 'అదేనేమో అద్దాలమేడ' అని ఆత్రుతగా చూసింది

"అద్దాల మేడింటికాడనా" అంటూ రిక్షావాడు స్పీడు ఎక్కించాడు తను అనుకున్నవి అద్దాల మేడలు కాకపోవటంతో విసుగెత్తి తలకాయని మళ్ళా రిక్షాలోకి లాక్కొని కూచుంది

"అద్దాల మేడ కాడికి వచ్చేసినావమ్మా" అంటూ రిక్షావాడు ఆపేడు

గెంతినంత వేగంగా రిక్షా దిగి రిక్షావాడికి డబ్బులిచ్చేసి గేటు మీద యింటి నెంబరు చూసి గేటు తలుపు తోసింది గేటు కిర్రుమంది ఎందుకో గుండెలు చాలా జోరుగా కొట్టుకుంటున్నట్లనిపించింది మనసులో ఏమూలో సంకోచం నక్కి వుంది

గేటు చప్పుడు విని ఆనంద తలుపులు తెరుచుకొని వచ్చింది ఆమెను చూడగానే సంతోషంతో పరుగున వెళ్ళి ఆమె చేతిని పట్టుకొంది "ఎన్నాళ్ళకి చూసానే ఆనందా" అంది హేమ పదేళ్ళ తర్వాత తనకిగల ఒకే ఒక ఆత్మీయురాలిని కలవగలిగినందుకు ఆ సంతోషం హేమ ముఖంలో కదులుతోంది మబ్బులాంటి వర్తమానమంతా స్నేహంలోని చల్లదనానికి కరిగి నీరై పోయేలా స్నేహితురాలి ఒడిలో తల దాచుకొని ఏడ్చేయాలనిపించింది పొట్టి పరికిణీలు కట్టుకొని కిలకిల్లాడుతూ ఆకాశంలోని విహంగాల్లా ఎగిరే ఆ రోజులు గుర్తుకొచ్చి మళ్లా అలా ఆనందతో చేతులు కలిపి పరుగులు

శీలా సుభద్రాదేవి

తీయాలనిపించింది. యింకా యింకా ఎన్నో భావాలతో ఊగిపోయింది హేమ మనసు. పదేళ్ళలో తన ప్రియమిత్రురాలు ఎన్ని కళలు సంతరించుకుందో అని కళ్ళ తోనే తడిమి తడిమి చూస్తూ పరవశమై పోయింది హేమ

"నిజమే చాలాకాలానికి కలుసుకున్నాం కదూ" అన్న ఆనందలక్ష్మి మాటల్లో ఏదో వెత్తి కనిపించినట్లు అనిపించింది హేమకు ఆమె చూపులు కూడా వింతగా వున్నాయి తను ఊహించినంత వుత్సాహంగా ఆనంద కనిపించలేదు హేమకు ఊహాల శిఖరం మీద నుండి జారిపోతున్నట్లుగా వుంది ఆధారం కోసమన్నట్లు ఆనందలక్ష్మి కళ్ళల్లోకి చూసింది తనని పరిశీలనగా చూస్తున్న ఆమె ముఖంలో చిరునవ్వు లేదు ఒక్కసారిగా నిస్పృహ కలిగింది హేమకు నిరసన దృష్టులకు, నిర్లక్ష్యవైఖరికి అలవాటుపడినదే అయినా ఆనందవైఖరిని భరించలేకపోయింది

ఆ చూపులకు అలవాటుపడిపోయి ప్రియమిత్రురాలి చూపులను కూడా అలాగే భావించినందుకు మనసును మందలించి మళ్ళీ చిరునవ్వును ముఖంలోకి తెచ్చుకొని "అప్పుడు పరికిణీలు కట్టుకొని బాల్యానికీ, యవ్వనానికీ కూడా చెందని దశలో చిలిపిగా గెంతులేసే వాళ్ళం, ఇప్పుడేమో చీరలు సింగారించుకొని పరువాని కొచ్చిన పండులాంటి పడుచు పిల్లలం అప్పటికీ యిప్పటికీ రూపంలోనే కాక భావాల్లోనూ, ఆలోచనల్లోనూ అన్నిటిలోనూ మనం మారిపోయాం కదూ!" అని సమాధానం కోసం ఆనంద వైపు చూపింది


అవును అన్నట్లుగా తలూపింది ఆనంద. ఆనాటి రోజులు జ్ఞప్తికి వచ్చి తన చేతిలోని హేమ చేతిని స్నేహపూర్వకంగా నొక్కి 'అప్పటికీ యిప్పటికీ నీ మాటల ధోరణి మాత్రం మారలేదు' అంటూ లోపలికి దారి తీసింది తిన్నగా తన గదిలోకి తీసుకుపోయి కూర్చోపెట్టింది ఆనందలక్ష్మి

కొంతసేపు ఆనంద తన కాలేజీ సంగతులు, హేమ తన ఉద్యోగ విషయాలు చెప్పుకున్నారు చిన్ననాటి సంఘటనలు జ్ఞప్తికి తెచ్చుకొని నవ్వుకున్నారు ఎప్పటి కప్పుడు అన్ని విషయాలు ఉత్తరాల్లో చెప్పుకున్నా ఇప్పుడు మళ్ళా ప్రత్యక్షంగా చెప్పుకున్నారు మళ్ళా చిన్నపిల్లల్లా అయిపోయి కేరింతలు కొట్టారు

అంతలో ఒకామె ఉతికిన బట్టలు తీసుకొచ్చి మంచం మీద పడేసి ఒక్కొక్కటే మడత బెడుతూ "బాగున్నావా హేమా" అంది

'తెలిసిన ముఖంలాగే ఉంది' అని పరిశీలనగా చూస్తున్న హేమ చటుక్కున గుర్తుపట్టింది! "నువ్వు ప్రభావతక్కయ్యవి కదూ!" అంది ఆశ్చర్యంగా, "అదేమిట క్కయ్యా అలా అసలు పోలిక లేకుండా అయిపోయావు? ఒంట్లో బాగా లేదా?" అంటూ ఆ వెంటనే మళ్ళీ ప్రశ్నల వర్షం కురిపించింది

"నాకేం! బాగానే ఉన్నాను" అంటూ ఓ చిన్న నవ్వు విసిరి మడచిన బట్టల్ని పెట్టిలో పెట్టి వెళ్ళిపోయింది ఆ కొద్దిసేపటిలోనే ఆమెలో ఉత్సాహం లేని నిర్లిప్త వైఖరి గమనించింది హేమ ఏమిటి ఒక్కసారిగా వాతావరణం బరు



ఏ పాత్రనయినా అవలీలగా పోషించ గలిగి రాజసత్వపు నటన ప్రదర్శించే కథానాయిక వాణిశ్రీ, యం. యస్. రెడ్డి నిర్వహణలో తయారవుతున్న 'దొరలు - దొంగలు' చిత్రంలో ఇలా కన్పిస్తుంది. దర్శకత్వం: కె. యస్. ఆర్. దాస్.

వుగా అయిపోయినట్లనిపించింది ప్రశ్నార్థకంగా ఆనంద ముఖంలోకి చూసింది ఆనంద సమాధానం చెప్పలేదు

కొంచెం సేపు పోయాక ఆనందే అంది "అప్పుడే నాలుగైంది ముఖం కడుక్కొని అలా బయటికి వెళ్ళివద్దాంరా"

ఇద్దరూ వాళ్ళింటి దగ్గర్లో వున్న పార్కుకి వెళ్ళారు

"ఇప్పుడు చెప్పు, ప్రభావతి అక్కయ్య శుభలేఖ పంపిన తర్వాత ఆమెను గురించి ఏమి అడిగినా సమాధానం రాసేదానివి కాదు ఏమిటి ఆమె అలా అయిపోయింది? వివరంగా అన్నీ చెప్పు" అంతవరకు ఉగ్గబెట్టుకొని ఉన్న హేమ పార్కులో కూర్చోగానే ఆతృతగా అడిగింది

ఎక్కడ నుండి మొదలు పెట్టడమా అని ఓ నిమిషం ఆలోచించి చివరకు ఆమె చెప్పింది—

"మీ నాన్నగారు పోయాక మీరు మీ తాతగారింటికి వెళ్ళిపోయారు కదూ, ఆ తర్వాత కొద్ది రోజులకే మాకు ఓ ఉత్తరం వచ్చింది—

అమెరికాలో ట్రైనింగుకి వెళ్ళిన భాస్కరం మామయ్య "తిరిగివచ్చేసానని, కలకత్తాలో ఉద్యోగం వచ్చిందని, అక్కడే ఎవరో అమ్మాయిని పెళ్ళి చేసుకున్నానని, క్షమించమ"ని ఉత్తరం రాసాడు

మా అక్కయ్యకి అతన్నిచ్చి చేయాలని చిన్నప్పటినుండీ మా పెద్దలు అనుకునేవారని నీకు తెలుసు కదూ ఆమెకి అతనంటే పెద్ద ప్రేమ లేకపోయినా

చిన్నప్పటినుండి అందరూ అనటంవలన కాబోయే భర్త అనే భావం పెంచుకుంది అంతలోనే యిలా జరిగింది

ఈ సంఘటన తర్వాత మా అక్కయ్య మూర్తికి దగ్గరైంది "

"మూర్తంటే " ఆలోచిస్తున్నట్లుగా అడిగింది హేమ

"మా నాన్నగారి ప్రియ శిష్యుడు, తరుచూ మా యింటికి వచ్చేవాడు మనం లెక్కలు చెప్పించుకునేవాళ్ళం గుర్తు లేదూ?"

ఆ రోజు అదే ఉత్తరం వచ్చిన రోజు సాయంత్రం మామూలుగానే మూర్తి వస్తే నేను లెక్కలు చెప్పించుకుంటున్నాను అక్కడే కుర్చీలో కూర్చొని మా అక్కయ్య పుస్తకం పట్టుకుంది కానీ ధ్యాస మరోవైపుంది మధ్యలో తడి అవుతున్న కళ్ళని ఎవరూ చూడకుండా వత్తుకుంటుంది అది గమనించాడు కాబోలు మూర్తి నెమ్మదిగా అన్నాడు "ఆ విషయం నాకు తెలిసింది మీరు మరీ యింత డీలా అయిపోవటం బాగా లేదు మీరంటే అతనికి లక్ష్యం లేనపుడు మీరు కూడా అలానే ఉండాలి ఇది తేలికగా తీసుకోడం మంచిది "

"ఆ తర్వాత అక్కయ్య అనుకోకుండా మూర్తికి దగ్గరైంది అక్కయ్యది మొదటినుండీ అదో తరహా ఎవరినో ఒకరిని మనసుకి దగ్గరగా ఊహించుకుంటేగానీ మా అక్కయ్యలాంటివాళ్ళు జీవించలేరు మొదట్లో మా మామయ్యని అలా అనుకుంది అతను పెళ్ళి చేసుకునే సరికి ఒంటరిగా ఫీలయింది ఆ సమయంలో మూర్తి ఆమెకు మానసికంగా కొంచెం దగ్గరయ్యాడు దాంతో ఆమె ఏకాగ్రత అతనిమీద వాలింది "

"మరి మీ అక్కయ్య భర్త పేరు మూర్తి కాదనుకుంటాను?" సంశయంగా అడిగింది

"మూర్తి కాదు వీళ్ళ పెళ్ళికి అమ్మా, నాన్నా ఒప్పుకోలేదు తన పెద్దలకి అభ్యంతరం ఉండదని, పెళ్ళి చేసుకుంటానని మూర్తి చాలా అడిగాడు కానీ మరో కులం కావటాన అమ్మ ఒప్పుకోలేదు అమ్మ మాట తీసిపారేయలేక నాన్నగారు మౌనం వహించేసారు మధ్య మూర్తీ, అక్కయ్యా నలిగిపోయారు మూర్తి తనతో వచ్చేయమని, రిజిష్టరు మారేజి చేసుకుందామని అక్కయ్యని ఎంతగానో బ్రతిమాలాడు అక్కయ్యనే కాదు, మా అమ్మానాన్నలను కూడా "

"మీ నాన్నగారు చదువూ, సంస్కారం ఉన్న వ్యక్తి ఆయన కూడా యిలాగే ప్రవర్తించారేమిటి? ఎంతో అభ్యుదయ భావాలున్న వ్యక్తి అని మీ నాన్నగారిని అనుకునేదాన్ని వారు కూడా వర్ణాంతరం చేయడానికి జంకేరంటే ఆశ్చర్యంగానే ఉంది "

"ఆశ్చర్యం దేనికి? మాటల్లో ఉండే అభ్యుదయం చేతల్లో ఉండటం అరుదే అటువంటివాళ్ళలో మా నాన్నగారు ఒకరు "

"పోనీ అక్కయ్య అయినా ధైర్యం చేయవలసింది కానీ అక్కయ్యకు ధైర్యం లేదు అసలు ఆమె తనంత తానుగా ఏమీ చేయలేదు ఎవరినో ఒకరిని మనసుకి దగ్గరగా ఊహించుకొని బ్రతకటం తప్ప అటువంటివాళ్ళని బాగుపరచటం కష్టం



ఈ గానాబజానా మీరు విజయావారి 'శ్రీరాజేశ్వరీ విలాస్ కాఫీక్లబ్‌లో' చూడగలరు.

మా అక్కయ్యకి పెళ్ళి నిశ్చయమైన తర్వాత ఓసారి మూర్తిని చూసాను గుర్తుపట్టలేనంతగా పాడైపోయాడు మూర్తిని అందరం కలసి బాధపెట్టాము దానికి ఫలితం యిప్పుడు అక్కయ్య అనుభవిస్తోంది" కళ్ళలో సుళ్ళు తిరిగి కంటి చివర నిలచిన నీటిబొట్టును కొనగోటితో మీటి కొంచెంసేపు మౌనంగా ఊరుకుంది ఆనంద

ఆనంద మాటలు సరీగా అర్థం కానట్లు అనిపించింది హేమకి కానీ ఎందుకో అడగలేక ఆతృతగా ఆనంద ముఖంలోకి చూస్తూ ఉండిపోయింది

"అక్కయ్య పెళ్ళి కామేశ్వర్రావుతో అయిపోయింది అతను రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నాడని నీకు చెప్పాననుకుంటాను రెండేళ్ళ క్రితం అక్కయ్య దగ్గరికి సెలవులకు వచ్చాను అప్పుడే నాకీ విషయం తెలిసింది ఓసారి నేను ఈ వూళ్ళోనే ఉన్న బంధువులింటికి వెళ్ళాను నా రిక్షాకి కొద్ది దూరంలో ఓ రిక్షాలో మా బావ, మరో అమ్మాయి ఉన్నారు వాళ్ళ రిక్షా ఓ హోటలు ముందు ఆగింది ఇద్దరూ ఒకరి చేతు లొకరు పట్టుకొని సరదాగా నవ్వుకుంటూ లోనికి వెళ్తున్నారు అంతలోనే నా రిక్షా వాళ్ళు కనిపించనంత దూరంలోకి వచ్చేసింది అతను మా బావేనా లేక అతన్ని పోలిన మరో వ్యక్తా అని చాలా ఆలోచించాను క్రితం రోజు టూర్‌కని వెళ్ళిన బావ మళ్ళీ యిక్కడ ఎలా కనిపిస్తాడు అనుకున్నాను అక్కయ్య ముఖంలోని నిర్లిప్తత గుర్తు వచ్చింది నా అనుమానం సరియైనదేనని మా బంధువులింట్లో తేలిపోయింది వాళ్ళింట్లో ఓ ముసలామె ఉంది ఆమె నన్ను చూడగానే "ఎవరూ, ప్రభావతి చెల్లెలా! మీ అక్కయ్య మా యింటికి రావటమే మానేసింది నా మనవడూ, నీ బావా ఒకే ఉద్యోగం చేస్తున్నారు కదా! నీ బావ వేషాలన్నీ తెలు

స్తూనే ఉన్నాయి ఎవర్తినో మరిగాడట కదా? ఆ ముక్క చెప్పామని కోపం వచ్చి మీ అక్క మా యింటికి రావటం మానేసింది" అని అంది నన్ను వాళ్ళింటికి వెళ్ళొద్దని అక్కయ్య అంతలా ఎందుకు చెప్పిందో అప్పుడర్థం అయింది ఆ ముసలావిడ మనమరాలు నా తోటిదే వుంది ఆమె దగ్గరనుండి వివరాలు రాబట్టాను 'ఆవిడ' ఏదో వూర్లో ఒంటరిగా వుండి ఉద్యోగం చేస్తుందిట టూర్లని చెప్పి బావ సగం రోజులు ఆమె దగ్గరికే వెళ్తుంటాడట ఆమెని ఈ వూరు రప్పించుకుంటుంటాడట "ఓసారి ఆమెని చూసాను మంచి కుటుంబంలోని పిల్లలానే ఉంటుంది చూడటానికి మర్యాదస్తురాలిలానే ఉంటుంది" అంది ఆ అమ్మాయి అవన్నీ వింటుంటే చాలా కోపం వచ్చింది మంచి కుటుంబంలో పుట్టి, ఉద్యోగం చేసుకొని లక్షణంగా ఉండక మళ్ళీ ఆ పనేమిటో? పెళ్ళైన వాళ్ళనైనా వాళ్ళ మానాన ఉండనీయకుండా యిలా ఊరి మీద పడటం ఎందుకో?" విపరీతమైన కోపం ధ్వనించింది ఆనంద కంఠంలో


అంతవరకూ ఓపిక పట్టిన హేమ మరి ఊరుకోలేకపోయింది "తప్పంతా ఆమె మీదే తోయటం న్యాయం కాదు ఉద్యోగము చేస్తున్న ఒంటరి ఆడవాళ్ళంటే చాలామందికి చులకన అందులో కొంచెం సోషల్ మువ్‌మెంట్ ఉన్న ఆడవాళ్ళంటే మరీ చులకన ధనదాహం, కామ దాహం తీరని ఏ కొద్దిమంది ఆడవాళ్ళో యిలా తమకి తాము పతనం కావటానికి సిద్ధమౌతారు కాని మిగతా చాలామంది సంఘం చేత వంచింపబడ్డవారే ఒకసారి పొరపాటు చేస్తే మరి సంఘం దాన్ని సవరించుకోనీయదు దారి తప్పిన వాడికి సరియైన గమ్యం చూపేవాళ్ళు లేనపుడు ఇష్టం ఉన్నా లేకపోయినా కనిపించిన దారంట నడవక తప్పదు వ్యభిచారులు అని వేలెత్తి చూపటమే కాని అలా కావటానికి కారణం ఏసీ అర్థం చేసుకునేవారు ఎంత మంది!" సంఘం మీద కసి మాటల్లో ధ్వనించింది ఆ కసి ఎరుపు జీరగా మారి కళ్ళల్లో ప్రతిఫలించింది

హేమలోని కసిని, ఆవేశాన్ని విస్మయంగా చూస్తూ ఉండిపోయింది ఆనంద

ఇంకా ఏదో అనబోయిన హేమ తన వైపు ఆశ్చర్యంగా చూస్తున్న ఆనందని చూసి చటుక్కున ఆపేసి "అదేమిటోయ్ అలా తెల్ల మొహం వేసావు? అప్పుడే చీకటి పడిపోయింది ఇక లేద్దాం" అంటూ మాట మార్చేసింది మాటలోని ఆవేశాన్ని మార్చుకున్నంత వేగంగా కళ్ళలోని ఎరుపు జీర మార్చుకోలేక పోయింది కాని మసక చీకటిలో ఆనందకి అది కనిపించలేదు

సంతాప సభకు వెళుతున్న వారిలా ఇద్దరూ మౌనంగా తలలు వంచుకొని ఇంటి వైపు నడిచారు ఇద్దరిలోనూ రకరకాల భావాలు కదులుతున్నాయి అవి వ్యక్తపరిచే ధైర్యం ఏ ఒక్కరికీ లేక వాటిని అణచుకొని మామూలుగా ఉండలేక ఇద్దరూ మౌనం వహించారు

తలుపు కొట్టగానే ప్రభావతి తలుపు తీసింది ప్రభావతి ముఖం పాలిపోయి కళావిహీనంగా ఉండటానికి కారణం అర్థమైన హేమకు గుండెల్లో కెలికినట్లైంది



సానుభూతిగా ప్రభావతి ముఖంలోకి చూసింది భోజనం ఏవో కబుర్లతో కానిచ్చేసిన తర్వాత యిద్దరూ డాబా మీదకి నడిచారు హేమ డాబా అంచు మీద కూర్చుంది

ఆనంద తామిద్దరికీ డాబామీద పక్కలు పరుస్తూ "కొంచెంసేపు ఇక్కడ పడుకొని చలివేస్తే మధ్యరాత్రికి లోపలకి పోదాం క్రిందయితే మనకి మాట్లాడుకోవటానికి ఏకాంతం కుదరదు" అంది

పక్కలు వేసిన తర్వాత ఆనంద కూడా అంచు మీద కూర్చొని మళ్ళా నెమ్మదిగా ప్రారంభించింది—"యింటికి తిరిగి వచ్చాక అక్కయ్యని ఆ విషయం అడిగాను అక్కయ్య అంతా తనకి తెలుసునని చెప్పింది ఏం చేయనే ఆనందా? టూర్లంటూ నెలకి యిరవై రోజులు వూళ్ళ మీద వుండే వ్యక్తిని గురించి ఏం తెలుస్తుంది? ఒక్కొక్కప్పుడు ఏమైనా అడిగితే కోపం తెచ్చుకుని నాతోటి మాట్లాడటం మానేస్తారు లేకపోతే నన్ను బెదిరించటానికి లతను పెళ్ళి చేసుకుంటానని అంటారు నేను కోరినదేమీ నాకు దొరకలేదు నాది దురదృష్ట జాతకం" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది నాకు ఆ క్షణంలో అక్కయ్య మీద చాలా కోపం వచ్చింది కొద్దో గొప్పో చదువుకొని కూడా యింత మూర్ఖంగా వుండే ఆడవాళ్ళని ఏమనగలం' ఈ కాలంలో కూడా యిలాంటి ఆడాళ్ళున్నారా అనిపిస్తుంది అసలు మగాళ్ళు అలా కావటానికి కారణం యిలాంటి ఆడాళ్ళే అందుకే నీ ఖర్మ అని ఊరుకున్నాను తిరిగి మా వూరు కెళ్ళాక అక్కయ్య యివేవీ అమ్మవాళ్ళతో చెప్పొద్దన్నా వుండలేక మా అమ్మతో చెప్పాను వాళ్ళు అలా "నీ ఖర్మ'ని ఊరుకోలేరుకదా! అందుకని ట్రాన్స్ఫర్ చేయించుకొని ఈ వూరు వచ్చాము మా అక్కయ్యకు మాకు కలిపి పెద్దిల్లు తీసుకున్నాము పెద్దవాళ్ళని

చూసైనా అల్లుడు బుద్ధిగా వుంటా డేమోనని "

ఆనంద చెబుతున్నది వింటూనే పరిసరాలన్నీ పరిశీలిస్తున్న హేమ కళ్ళు చటుక్కున ఒక దగ్గర ఆగిపోయాయి క్రింద పెరట్లో ముఖం కడుక్కుంటున్న వ్యక్తిని పరిశీలనగా చూసింది గుండెలు దడదడలాడాయి నాలిక పిడచ కట్టుకుపోయినట్లయింది కొంతసేపటికి గొంతు పెకలించుకొని అడిగింది "అతనెవరు?"

అదోవిధమైన తిరస్కారంతో అటు చూస్తూ అంది ఆనంద "ఇంకెవరు? అతనే కథానాయకుడు మా బావ "

హేమ చటుక్కున లేచి ప్రక్క మీద వాలిపోయింది కళ్ళు గట్టిగా మూసుకుంది మసక వెన్నెలలో హేమ ముఖం ఆనందకి కనిపించలేదు

"నిద్రొస్తుందా? పడుకో, పయాణం బడలిక తీరనీయకుండా నేను సొద మొదలెట్టాను" నొచ్చుకుంటూ అంది ఆనంద

తను కూడా ప్రక్క మీదకి చేరింది

ఓ పది నిమిషాలు పోయాక హేమ ఆనంద వైపు తిరిగింది చాలాసేపటి నుంచీ మథన పెడుతూ ఉన్న సందేహం తీర్చుకోకుండా ఉండలేకపోయింది ఓ నిమిషం ఊరుకొని అంది "ఆమెను చూసానన్నావు కదా? ఆమె ఎలా ఉంటుంది?"

ఆ మసక చీకటిలోనే హేమ ముఖం వైపు వంగి చిన్నగా నవ్వి అంది ఆనంద "నిజం చెప్పనా? నువ్వేమీ అనుకోకూడదు ఆమెను స్పష్టంగా చూడకపోయినా నీలో ఆమె పోలికలు చాలా ఉన్నట్లుగా అనిపించింది ఆమెను దూరంగా చూసినపుడు నువ్వు గుర్తు రాలేదు కానీ నిన్ను చూడగానే ముందు ఆమె గుర్తుకు వచ్చింది నువ్వు బాధ పడతావని నీతో ఈ విషయం చెప్పకూడదనుకున్నాను కానీదాచుకోలేకపోయాను "

మౌనంగా అటువైపు తిరిగి కళ్ళు గట్టిగా మూసుకుంది హేమ అంత గట్టిగా కళ్ళు మూసుకున్నా ఓ రెండు కన్నీటి చుక్కలు అంచులు దాటుకొని వచ్చి మెల్లగా జారిపోయి తలగడలో యింకిపోయాయి ★

# భారత ప్రభుత్వపు గ్రాంటు

తెలుగు మహాజన సమాజం (మద్రాసు) యొక్క సాంస్కృతిక విభాగం క్రింద నడుపబడుతున్న 'సరస్వతి గిరి లైబ్రరీ'కి గ్రంథాలూ ఫర్నిచరూ ఏర్పరచుకొనేందుకు భారత ప్రభుత్వం అయిదువేల రూపాయల గ్రాంటు నిచ్చింది తెలుగు మహాజన సమాజానికి భవననిర్మాణ నిమిత్తం ఆరు గ్రౌండ్ల స్థలాన్ని తమిళనాడు ప్రభుత్వమూ, లక్షరూపాయల గ్రాంటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమూ ఇచ్చాయి ప్రభుత్వ ప్రోత్సాహాన్ని పొందిన యీ సేవాసంస్థ మద్రాసులోని తెలుగువారికి ఇతోధికంగా సేవచేసేందుకు కృషి చేయగలదని ఆశిస్తున్నాము